క్లుప్తంగా

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని 13 గ్రామాల్లో ఈ నెల 19వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రామచంద్రపురం డీఈ విజయానంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, వెదురుమూడి, నల్లూరు, వడ్లమూరు, వల్లూరు, నిడసనమెట్ట, నేలటూరు, అచ్యుతాపురం, కాలేరు, టేకి, మాచరమట్టలు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

కె.గంగవరం మండలంలో..

కె.గంగవరం: స్థానిక బస్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో రేపు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని కె.గంగవరం, సత్యవాడ, తామరపల్లి, కుందూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత

కపిలేశ్వరపురం: ఓటు వేయడాన్ని ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యతగా భావించాలని సామాజిక కార్యకర్త పెద్దింశెట్టి రామకృష్ణారావు కోరారు. మండలంలోని అంగరలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమయం అత్యంత కీలకమైనదన్నారు. వ్యక్తిగత ఆరాధన, కులం, మతం, ప్రాంతం తదితర ప్రభావాలకు లోను కాకుండా పార్టీల విధానాలను అధ్యయనం చేసి ఎవరికి ఓటు వేయాలన్నది నిర్ణయించుకోవాలన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సూరిపండు

మండపేట: మండలంలోని తాపేశ్వరంలో శ్రీ కోదండరామా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా వ్యాపారి గ్రంధి సూరిపండు నియమితులయ్యారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అయినవిల్లి: ఒంటరిగా ఉన్న ఓ వృద్ధ మహిళ ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో బంగారు గొలుసును బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్ కుమార్, ఆమె బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లిలోని ముక్తేశ్వరంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఒంటరిగా ఉంటున్న 70 ఏళ్ల చంద్రమౌళి సత్యవతి ఇంట్లోకి బుధవారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని వ్యక్తి చొరబడి ఆమె మెడలో నాలుగున్నర కాసుల బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



విద్యార్థులకు జాగ్రత్తలు వివరిస్తున్న ఎస్ఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి

అనపర్తి: అప్రమత్తత, అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని అనపర్తి అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం అనపర్తి అగ్నిమాపక సిబ్బంది స్థానిక జీబీఆర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఎస్ఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వినియోగించే వివిధ పరికరాలను ప్రదర్శించిన అగ్నిమాపక సిబ్బంది వాటి పనితీరును, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం



దివాన్‌చెరువులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దివాన్‌చెరువులోని నాలుగు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. మహా గణపతి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీటిని స్థానిక ప్రముఖులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు.

కన్నులపండువగా రాములోరి కల్యాణం



గొల్లపాలెంలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- సత్యవాడలో ఆకట్టుకున్న చలువపందిళ్లు
- వాడవాడలో అన్నదానాలు

కె.గంగవరం: సీతారాములు కల్యాణమూర్తులుగా దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని సీతారామాలయాల వద్ద ఉదయం నుంచి సందడి నెలకొంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులతో కలసి ఆలయాల వద్ద పూజలు చేసి స్వామివారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. యర్రపోతవరం, సత్యవాడ, పామర్రు, అముజూరు, కె.గంగవరం, దంగేరు తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అంగరంగ వైభవంగా..

మండలంలోని సత్యవాడలో గత సంప్రదాయాలకు అనుగుణంగా ఈ ఏడాది కూడా స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నాలుగు ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలోని మండపాల వద్ద కల్యాణం కమనీయంగా నిర్వహించారు. నాలుగు చోట్ల భద్రాద్రిలో స్వామికి నిర్వహించే అభిజిత్ ముహూర్తానికే స్వామివారి కల్యాణం జరిపించారు. స్వామివారు, అమ్మవార్ల కోసం ప్రత్యేకంగా అలకంరించిన కొబ్బరికాయలు ఆకట్టుకున్నాయి. ప్రతి కుటుంబం వారి బంధువులతో కలసి మండపాల వద్ద ఆశీనులై స్వామివారి కల్యాణాన్ని జరిపించారు.

ఆకట్టుకున్న చలువపందిళ్లు..

నెల రోజుల ముందు నుంచే గ్రామంలో ప్రతి కుటుంబం సొంతంగా కాగితపు పువ్వులను తయారు చేస్తారు. వీటిలో సీతారాముల ఆలయం వద్ద చలువపందిళ్లను ఏర్పాటు చేసి వాటిలో అమర్చారు. వీటిని చూడడానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సత్యవాడ చేరుకుని తిలకించారు. విద్యుత్ దీపాల మధ్య కాగితపు పువ్వులను ఆహుతులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం గ్రామంలో గారడీలు, గరగనృత్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు, చుట్టుపక్కల మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రామాలయాల ఎదుట చలువ పందిర్లు వేసి పచ్చని మామిడితోరణాలు, విద్యుత్‌దీపాలంకరణలతో సుందరంగా అలంకరించారు. గ్రామ, గ్రామాన సీతారామ లక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలను బాజాభజంత్రీలతో, బాణాసంచా కాల్పులతో పుర వీధుల్లో ఊరేగించారు. సీతారాములను పట్టువస్త్రాలతో అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. పలుచోట్ల బారీ ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించగా దాదాపు అన్ని రామాలయాల వద్ద పానకం, చలివిడి వడపప్పు పంపిణీచేసి, ప్రసాదం వితరణ చేశారు.



కాగితపు పువ్వులతో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



వెలంపాలెం వేద పాఠశాల వద్ద చలువ పందిరిలో సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

చలువ పందిరి నీడలో చల్లని రామయ్య కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చలువ పందిరిలు వేసి చల్లని రామయ్య కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కన్నులారా తిలకించగా సీతారాముల కల్యాణం వేద మంత్రాల నడుమ కమనీయంగా నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు బెల్లాలు ప్రసాదంగా అందజేశారు. తాళ్లపొలం, జగన్నాయకులపాలెం, వెలంపాలెం, నరసాపురపుపేట, యనమదల, భీమక్రోసుపాలెం తదితర గ్రామాల్లో రాములోరి కల్యాణ క్రతువులు నిర్వహించారు. గ్రామంలోని మార్కెట్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో 1955 నుంచి సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహిస్తున్నారు.

వెలంపాలెం వేద పాఠశాలలో

శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, శ్రీచంద్రశేఖర భారతీస్వామి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద పాఠశాల ఆవరణలో బులుసు సోమనాథశాస్త్రి, శేషమ్మ దంపతుల స్మారక సభావేదికపై మైలవరపు మృత్యుంజయ శాస్త్రి(చోడయ్య) బ్రహ్మత్వంలో సీతారామ కల్యాణ మహోత్సవం అశేష భక్తుల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. సీతారామచంద్రమూర్తి సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రాముని జీవితం అందరికీ ఆదర్శం

- విజయదుర్గా పీఠాధిపతి గాడ్
- పీఠంతో సహా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

రాయవరం: ఏకపత్నీ వ్రతుడైన శ్రీరామచంద్రుడి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా పీఠంలో ఆయన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. శ్రీరాముడు, జానకీదేవిలు లోకానికి ఆదర్శప్రాయులైనందునే వాడవాడలా రామాలయాలు వెలిశాయన్నారు. భద్రాచలం దేవస్థానం అందజేసిన సీతారామచంద్రుల ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకలు తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. కల్యాణం అనంతరం పీఠంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఏ గ్రామం చూసినా పెళ్లి సందడే

శ్రీరామ నవమి వేడుకలను మండలంలో వైభవంగా నిర్వహించారు. తమ ఇంట్లో వివాహం జరుగుతున్నట్టుగా చిన్నా పెద్దా రామాలయాలకు చేరుకున్నారు. శ్రీరామ కీర్తనలను ఆలపిస్తూ ఉదయాన్నే సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ గ్రామానా ఊరేగించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి నీలమేఘ శ్యాముడి వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించిన అనంతరం ఆలయాల వద్ద భక్తులు బెల్లపు పానకాన్ని తీర్థంగా పంపిణీ చేశారు. పలు రామాలయాల వద్ద భారీగా సమారాధన నిర్వహించారు. రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, మాచవరం, పసలపూడి, నదురుబాద, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా ఆలయ కమిటీలు నిర్వహించాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. పడమర ఖండ్రిక బొమ్మల రామాలయంలో నిర్వహించిన ఉత్సవ పీటలపై వైఎస్సార్ సీపీ నాయకులు కరాటపు దుర్గా ఖండేశ్వరరావు తనయుడు అమ్మిరాజు, రమ్య దంపతులు పూజలు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ హాజరయ్యారు. కపిలేశ్వరపురం, అంగర, వెదురుమూడి, తాతపూడి, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బెల్లం పానకం, వడపప్పులను ప్రసాదంగా అందజేశారు. పలు ఆలయాల్లో ఏకాహం నిర్వహించారు. ఆలయాల్లో వేద పండితులు స్వామి కల్యాణ పూజలు చేశారు. అంగరలోని పోతురాజుగూడెంలో నిర్వహించిన వేడుకకు టీడీపీ నియజకవర్గ నేత వల్లూరి సాయికుమార్ హాజరయ్యారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

మండపేట: శ్రీరామ నవమి వేడుకలు మండపేట రూరల్, అర్బన్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పలు రామాలయాల వద్ద భారీ ఎత్తున అన్నదానం చేశారు. ఉదయం నుంచే రామకోవెలలు సందడిగా మారాయి. పట్టణంలోని రథం గుడి, కన్యకాపరమేశ్వరి ఆలయం, నాయుళ్ల రామాలయం, పాటి మీద ఉన్న రెండు రామాలయాలు, బురుగుంట చెరువు గట్టుపై ఉన్న సీతారామా క్షేత్రంలోనూ సీతారాముల కల్యాణాలు నిర్వహించారు. అలాగే స్థానిక గొల్లపుంత, మెయిన్ రోడ్డులోని తూర్పు కాపు, అరుంధతీ పేటలోని రామాలయాల్లో కల్యాణ క్రతువును అంగరంగం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. ఉత్సవ మూర్తులను స్థానిక పెద్ద కాలువ వద్దకు తీసుకువెళ్లి స్నానాలు ఆచరింపజేశారు. కేపీ రోడ్డులోని టైలర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 97వ శ్రీరామనవమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వెదురుపాక విజయదుర్గా పీఠంలో సీతారామ కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



మండపేటలోని గొల్లపుంత రామాలయంలో..



పడమర ఖండ్రిక బొమ్మల రామాలయంలో పృథ్వీరాజ్

లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు

- జోరుగా వైఎస్సార్ సీపీ ప్రచారం
- ఇంటింటి ప్రచారాన్ని పూర్తి చేసిన సూర్యప్రకాశ్



కాజులూరు మండలం దుగ్గుదూరులో స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం చేస్తున్న లబ్ధిదారులు

రామచంద్రపురం: లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు అని పిలుపునిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట మేరకు రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రజలే క్యాంపెయినర్లుగా వైఎస్సార్ సీపీకి మద్దతుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందితే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి మద్దతు పలకాలని, మీరే స్టార్ క్యాంపెయినర్లుగా మారాలని ఇచ్చిన పిలుపు మేరకు లబ్ధిదారులు వైఎస్సార్ సీపీ తరపున ప్రచారం చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాలతో పాటుగా రామచంద్రపురం పట్టణంలోను ప్రచారం జోరుగా జరుగుతుంది.

ప్రచారంలో ముందంజ

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ప్రచారంలో ముందంజలో దూసుకుపోతున్నారు. కె.గంగవరం, కాజులూరు మండల గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని పూర్తి చేసుకుని భారీ ర్యాలీ చేశారు.

ఇప్పటికే పూర్తయిన ప్రచారం

జనవరి నెలలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇంటంట ప్రచారాన్ని ప్రారంభించారు. రామచంద్రపురం మున్సిపాలిటీతో పాటుగా కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో ఇంటింటికీ వెళ్లి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

పెద్దలను కలుస్తున్న ఎంపీ బోస్

వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ తండ్రి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనదైన శైలిలో నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన గ్రామాల్లో పెద్దలను కలుస్తూ వైఎస్సార్ సీపీకి మద్దతు పలకాలని కోరుతున్నారు.

ఆపదలో అండగా నిలిచే నేత తోట

- ఆయన గెలుపునకు సహకరించండి
- వైఎస్సార్ సీపీ నాయకుల విజ్ఞప్తి
- మండపేట 1, 26, 27 వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



మండపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలబడే నాయకుడైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గెలుపునకు ఈ ఎన్నికల్లో సహకరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా, ఆ పార్టీ యువ నేత తోట పృథ్వీతో కలసి బుధవారం పట్టణంలోని 1, 26, 27 వార్డుల్లో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు పోతంశెట్టి ప్రసాద్, అమలదాసు లక్ష్మి, నీలం దుర్గమ్మ ఆధ్వర్యంలో ఈ ప్రచారం సాగింది. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు పట్టం కట్టాలని నాయకులు కోరారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే తోట త్రిమూర్తులును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, చల్లా ప్రసాద్, ఈలి తాతాజీ, చింతల రాణి, డెక్కల వరలక్ష్మి, షేక్ ఫాతిమా, పేకేటి మాణిక్యం, అధికారి శ్రీను, షేక్ గౌస్, సర్కార్, సాస్తా హుస్సేన్, అమలదాసు రుద్రమూర్తి, సయ్యద్ రబ్బానీ, శెట్టిబలిజ సంఘం ప్రెసిడెంటు పంపన శ్రీనివాస్, పెంకే గంగాధర్, షేక్ అలీఖాన్ బాబా, పేపర్తి సత్యనారాయణ(సాంబు) పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి సూర్యప్రకాశ్ నామినేషన్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాశ్ నేడు(గురువారం) ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. ఉదయం మండలంలోని హసన్‌బాద నుంచి బయలుదేరి ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి ఆలయంలో సూర్యప్రకాశ్ ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి కార్యకర్తలు, అభిమానులతో రామచంద్రపురం పట్టణంలోని రాజగోపాల్ సెంటర్ వరకు ర్యాలీగా వస్తారు. అనంతరం అక్కడి నుంచి ప్రధాన రహదారిలో పాదయాత్రగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో తన నామినేషన్‌ను సమర్పించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితర ప్రజాప్రతినిధులు, తరలిరావాలని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బుధవారం పిలుపునిచ్చారు.

భారీ ఎత్తున తరలిరండి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాశ్ నేటి ఉదయం నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు శెట్టిబలిజ సంఘ నాయకులు నరాల ఏడుకొండలు, కట్టా సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని శెట్టిబలిజ సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కులాన్ని ఏ రాజకీయ పార్టీకి తాకట్టు పెట్టొద్దు



మీడియాతో కాపు అభ్యుదయ సంఘ నాయకులు

మండపేట కాపు అభ్యుదయ సంఘం నేతలు

మండపేట: కాపు కులాన్ని ఏ రాజకీయ పార్టీకి తాకట్టు పెట్టొద్దని మండపేట కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు జిన్నూరి సత్యసాయిబాబా, కార్యదర్శి యాళ్ల శ్రీనివాస్, కాపు నాయకుడు ముక్కా సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో బుధవారం స్థానిక జొన్నల శేషాయమ్మ అబ్బులు కాపు కల్యాణ మండపంలో మండపేట కాపు సంఘం మీడియా సమావేశం నిర్వహించింది. అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రాజకీయ పార్టీలు 'విభజించి పాలించు' అనే సూత్రంతో కాపులను విడదీయాలని చూస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని కాపులందరూ అర్థం చేసుకుని మెలగాలని కోరారు. ఇటీవల పట్టణంలో నిర్వహించిన కాపు సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు సన్మానించడాన్ని కొందరు రాజకీయ రంగు పులమడం తగదన్నారు. గురువారం బాబూ అండ్ బాబూ కన్వెన్షన్ హాల్లో జరిగే కాపు సమావేశానికి తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని సాయిబాబా స్పష్టం చేశారు. ఏ పార్టీలో ఉన్నా కాపులంతా దర్జాగా వుండాలనే కాపు సంఘం కోరుకుంటోందన్నారు. రాజకీయ పార్టీలకు కాపు కులాన్ని తాకట్టు పెట్టేలా వ్యవహరించరాదన్నారు. కాపు నాయకులు మెండు బాపిరాజు, శెట్టి నాగేశ్వరరావు, శిరంగు శ్రీనివాస్, దూలం చక్రవర్తి, మహంతి అసిరినాయుడు, ఎర్నేని సత్యం, ముక్కా దాలయ్య, రెడ్డి రత్తయ్య, పులగం శ్రీనివాస్, సిద్దిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ

అయినవిల్లి: సేవాతత్పరతతో పనిచేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ల కాశీఅన్నపూర్ణశ్రీనివాస్ దంపతులను నగరం మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అభినందించారు. బుధవారం అన్నపూర్ణ శ్రీనివాస్ దంపతులు విలస గ్రామంలోని మన్నా మినిస్ట్రీస్ న్యూ లైఫ్ సెంటర్ (కుష్ఠు, ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం)లో వ్యాధి పీడితులకు బ్రెడ్లు, పండ్లు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనే గంగుమళ్ళ అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులు అనేక సేవలు అందించారని అభినందించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గిద్దాం

పచ్చిరొట్టతో భూసారం పెరుగుదల



గంగలకుర్రులో పచ్చిరొట్ట పైరు

అంబాజీపేట: రబీ వరికోతలు పూర్తవగానే మూడో పంటగా పచ్చిరొట్టను సాగు చేస్తే భూమిలో సారవంతం పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా విచక్షణ రహితంగా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. రసాయన ఎరువుల అధిక వినియోగం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం కోల్పోతున్న విషయాన్ని రైతులు గుర్తించడం లేదు. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైరు పెంపకం తగ్గిపోయింది. దీని వలన భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన పదార్థాలను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీ పంట అనంతరం పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. అలాగే కొబ్బరి తోటల్లోను పచ్చిరొట్ట పైరును రైతులు పెంచుతున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 600, కొత్తపేట నియోజకవర్గంలో 750, రాజోలులో 976 ఎకరాల్లో జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేపట్టారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర, తదితర రకాలను రబీ పంట అనంతరం సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. సేంద్రియ కర్బనం పెరుగుతుంది. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. గుళికలను అధికంగా వాడడం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మజీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుని, నికర లాభం పొందడానికి వీలవుతుంది.
>
> – సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట